# వసంతం వస్తేనా....

పొద్దున నిద్ర లేవగానే రవి తన గది తలుపులు మూసేస్తాడు. అప్పుడా గది అతని మనస్సుకీ, శరీరానికీ ఒక తాలింఖానా.

ఆ గదిలో ఒక పాతకాలపు పందిరిమంచం వుంది. రెండు పక్కల రెండు గంతల్లాంటి చిన్న కిటికీలున్నాయి. ఆ తలుపు లెప్పుడూ మూసే వుంటాయి. పైన గాలికంటే చప్పుడు ఎక్కువ వచ్చే పాత పంఖా ఒకటి తిరుగుతుంటుంది. పందిరి మంచానికి ఎదురుగా ఒక నిలువుటద్దం. ఆ అద్దం పక్కన ఒక నల్ల విరుగుడుచేవ బీరువా తాతల నాటిది. ఆ పక్కని ఒక చిన్న తలుపు. అందులోంచి వంగి వెడితే – ఒక నీళ్ళ కుళాయి, కక్కుసు వగైరా ఉన్న ఒక చిన్న గది. పందిరి మంచానికి, బీరువాకీ మధ్య అసలు తలుపుంది. రవి నిద్ర లేచాక కొద్ది గంటలు తప్పిస్తే, ఆ తలుపు ఎప్పుడూ తెరిచే వుంటుంది. అదే రవికీ, మిగతా ప్రపంచానికి మధ్య అనుబంధం కల్పించేదీ, లేకుండా చేసేదీ కూడా. అది అతని ఆశలకూ, నిరాశలకూ, కలలకూ, వాటి సాఫల్యానికీ ఒకే ఒక మార్గం. ఎందుకంటే, ఆ తలుపుకి ఎదురుగా హాల్లో రెండో పక్కని మరొక తలుపుంది. ఇల్లాంటిదే, ఆ తలుపుకి వెనుక మరొక గదుంది; అచ్చు ఇల్లాంటిదే. ఆ గదిలో కవిత వుంది.

కవిత అతని భార్య.

ఆ గది తలుపు అతనిలో రకరకాల ఆవేశాలూ, ఊహలూ రేకెత్తిస్తుంది. ఒకొక్కప్పుడా తలుపు అతనికి స్వర్గద్వారం. అతని సూక్ష్మశరీరం అందులోంచి పోయి, గులాబి రేకులతో పరచిన సన్నని మార్గాన్ని అనుసరించి, అప్సరసలు అర్ధనగ్నంగా విహరించే అపురూప మయిన నందనవనంలోకి సగం గాలిలో తేలిపోతూ వెడుతుంది. అలసిపోయేటంత వరకూ అక్కడ విహరిస్తుంది; ఆనందంతో మత్తెక్కి పోతుంది. తిరిగి రావడం అతనికి గుర్తుండదు. అప్పటికి అతనికి నిద్రపడుతుంది.

మరొకప్పుడా తలుపు అభేద్యమయిన దుర్గద్వారం. అతని ఏకాంతమనే పవిత్రమయిన జన్మహక్కును కాపాడే కవచం. బయటి లోకం తాలూకు బాంధవ్యాలు, బాధ్యతలు, అతని ఏకాంతంమీద దాడి చేస్తాయి. మూసిన తలుపుమీద ఎవరైనా తట్టితే ఆ చప్పుడు అతని దుర్గంమీద శత్రువుల ఫిరంగి మ్రోత. క్రమంగా అతని ఊహలో ఆ గదిచుట్టూ ఒక కందకం, అవతల దూరాన శత్రుసేనల గుడారాలు, ఏనుగులు, లొట్టిపిట్టలు, ఎన్నో తయారౌతాయి. భయంకర సమర దృశ్యాలు తెరమీద బొమ్మల్లా కదిలి చెదరి పోతుంటాయి. అన్ని దృశ్యాలలోనూ, అతను ఒంటరిగా వేల కొలది సైనికులను ఎదుర్కొంటాడు. అయితే ఆ దృశ్యాల్లో జయం ఎప్పుడూ అతనిదే. అంచేత దృశ్యం ఎంత భయంకరంగా ఉన్నా, అతనికి భయం వెయ్యదు. తీవ్రమయిన ఆవేశం అతన్ని అలసతే పెట్టేస్తుందంట.

అన్నిటికన్నా అతనికి ఇష్టమైన ఊహ ఒకటుంది. అది ఇంచుమించుగా ఒక కల; తిరిగి తిరిగి వచ్చే కల; తాను వలచిన ఒక అపురూపమయిన అందకత్తె ఒక

దుర్గంలో వుంది. ఆమె తండ్రియైన రాక్షసుడు ఆ దుర్గద్వారాన్ని ఎప్పుడూ కాపలా కాస్తుంటాడు. రవి ఆ యువతిని చూస్తాడు. ఆ చూపుల్లో వారి హృదయాలు కలుస్తాయి. కాని వారి ప్రేమ సాఫల్యానికి అడ్డుగా ఆ రాక్షసుడున్నాడు. రవి వేచి ఉంటాడు. అలా ఉండగా రాక్షసుడు ఒకనాడు మత్తుగా మద్యం సేవించి, రెండు ఏనుగుల్నీ, ఒక ఖడ్గమృగాన్నీ విరిచి, తినేసి, గుమ్మం పక్కనే ఒదిగి గుర్రెట్టి నిద్రపోతుంటాడు. రవి మెల్లగా ఆ ద్వారంలో నుంచి లోపలికి వెళ్ళిపోతాడు. తరవాత దుర్గంలో రకరకాల ప్రతిబంధకాలను తప్పించుకునే దృశ్యాలు కొన్ని మనస్సులోకి రాబోతాయి గాని, రవికి రాబోయే ఘట్టాలమీద ప్రీతి ఎక్కువ కావడంచేత నీటిమీద బుడగల్లా అవన్నీ పుట్టుకలోనే అణగిపోతాయి. అతను అన్ని అడ్డంకులూ గడచి, ఆమె నిద్రిస్తున్న గదిలోకి వెడతాడు. కాని ఆమెను లేపకూడదు. కారణం ఏమంటే, ఆమె ఎంతగా తన్ను ప్రేమించినా, తనతో రావడానికి ఇష్టపడదు. కారణం తండ్రి చంపేస్తాడన్న భయం. అప్పుడతను ఏంజేస్తాడు? రొంటికి కట్టిన మత్తు మందు పొట్లం విప్పుతాడు. అది ముందుగా బొడ్డులో కట్టుకుని వచ్చింది గాదు. ఆ ఘట్టం వచ్చేసరికిగాని దాని అవసరం జ్ఞాపకంరాదు. ప్రతిసారీ అంతే. సరే, ఆ మందు ఆమెమీద చల్లుతాడు. ఆమెను రెండు చేతుల్లో ఎత్తుకుంటాడు. మూసివున్న ఆమె కళ్ళను ముద్దు పెట్టుకుంటాడు. అతని శరీరం తూలుతుంది; అమె బరువువల్ల కాదు, ఆ స్పర్శవల్ల. మెల్లగా ఇవతలికి వస్తాడు. నిద్రపోతున్న రాక్షసుడిప్పుడు గుమ్మానికడ్డంగా దొర్లాడు. పర్వతంలాంటి అతని శరీరం గుమ్మాన్ని యించుమించుగా మూసేసింది.

అక్కణ్ణించి కల రోజుకొక రకంగా మారుతుంది. ఎలా మారినా మారనివి రెండు వివరాలున్నాయి; ఒకటి; ఆ గుమ్మం తన గుమ్మం అయిపోతుంది. రెండు; చేతిలో ఉన్న సుందరాంగి, తన భార్య కవితై పోతుంది. మూడోది అంత నిర్ధారణగా కాకపోయినా అప్పుడప్పుడు జరుగుతుంది. ఆ రాక్షసుడు తన మామగారు - బ్రహ్మానందంగారిలా మారిపోతాడు. కలకీ వాస్తవానికీ మధ్య కలగలుపులో ఆ రాక్షసుణ్ణి బ్రహ్మరాక్షసుడని రవి అనుకోవడం కద్దు.

అయితే కవితకూ అతనికీ మధ్య బ్రహ్మానందంగా రెన్నడూ రాలేదు. నిజానికి ఇద్దరి మధ్య అడ్డంకులే లేవు - ఒక్క రవి ఏర్పరచుకున్నవి తప్ప. వేరు వేరు పడకగదుల వ్యవహారం అతని పట్టుదలమీదే కవిత ఒప్పుకుంది.

రవికీ, అత్తవారింట్లో వున్న మిగిలిన వ్యక్తులకూ - ఒక్క అత్తవారింట్లోనేకాదు, సామాన్యంగా లోకంలో అందరూ అంతే అనుకోండి - బ్రతుకును గురించీ, ప్రణయాన్ని గురించీ, దాంపత్యాన్ని గురించీ, అభిప్రాయ భేదాలున్నాయి. రవికి బ్రతుకు ఒక ఊహ; మిగతా వాళ్ళకది ఒక వ్యాపారం. ప్రణయం రవికి జీవిత లక్ష్యమయితే, మిగతా వాళ్ళకది అన్నంలోకి నంజుళ్ళాంటిది, దాంపత్యం తక్కిన వాళ్ళకి ఒక దిన చర్య; రవికి మాత్రం క్షణక్షణ రమణీయమై, నిత్యనూతనమై, ప్రేయసీప్రియులు హృదయాలను అవినాభావంగా కలిపే ఒక పవిత్రబంధం. దంపతులిద్దరు, అనుక్షణం ఒకరి కొకరు కొత్తగా కనిపించాలి. అందుకోసమే కవితను వేరే గదిలో ఉండమన్నాడు రవి. కాని, కవిత్వం ఎరగని కవిత వాగ్వాదం ఎందుకని సరేనంది. క్షణక్షణ రమణీయతను సాధించడానికి రవి శక్తి కొలదీ

ప్రయత్నించేటప్పుడు ఆమె రెండు మూడు పర్యాయాలు ఆవులించడం వల్ల తన ప్రయత్నాలు విరమించుకున్నాడు. వాస్తవంగా వీల్లేనివన్నీ ప్రతిరోజూ అతను తన కలల్లో సాధిస్తాడు. అందుకే అతని కలల్లో – పగటివి కానీయండి, రాత్రివి కానీయండి – ఏ అందగత్తెతో అతను ప్రణయం ప్రారంభించినా గుమ్మం దాటి గదిలో అడుగు పెట్టేసరికి ఆమె కవితగా మారిపోతుంది.

అసలు రవి కవితను పెళ్ళి చేసుకోడానికి ఆమె పేరే ముఖ్యమయిన ఆకర్షణ.

బ్రహ్మానందంగారు తన ఏకైక పుత్రికకు ఆ పేరు పెట్టడానికి ఆయనకు కవిత్వంమీదున్న అభిమానం కాదు కారణం; కవులమీద ఆయనకు ఆశ్రిత పక్షపాతం వంటిది ఒకటుంది. ఆయన ఆస్థానంలో ఒక పేద కవి ఉన్నాడు. అమ్మాయికి అందమయిన పేరేదన్నా చెప్పమని ఆ కవిని అడిగాడు బ్రహ్మానందంగారు. ఆ కవిగారు కవిత అని పెట్టమన్నారు. చిన్నదిగా అందంగా ఉందని బ్రహ్మానందంగారు సరేనన్నారు.

ఎక్కాల పుస్తకమయినా ఛందస్సులో పెట్టేసరికి కవిత్వమేమో ననిపిస్తుంది. కవిత అన్న పేరుగల అమ్మాయిలో కవిత్వం రవంతయినా ఉండకపోదనిపిస్తుంది. రవికా భ్రమ ఈనాటికీ పోలేదు. ఆమె హృదయంలో దాగి ఉన్న రస సముద్రాన్ని బయటికి తేవడానికి రవి పది సంవత్సరాలుగా పాటు పడుతున్నాడు. అయితే ఇంకా ఆ రససింధువు ఉత్తర ధ్రువంలోని సముద్రంలా గడ్డ కట్టుకునే వుంది.

బ్రహ్మానందంగారు, రవిని అల్లుడుగా అంగీకరించారంటే కవుల మీదే కాదు – కవి కాబోయే లక్షణాలున్న యువకులమీద కూడా కొంత సద్భావమే ఉందనుకోవాలి. అల్లుడిలో ఆయనకి కావలసినవి రెండు లక్షణాలు. ఒకటి: అతను అందగాడై ఉండాలి. రెండు: అతనొచ్చి ఇల్లరికం ఉండాలి. అయితే రవిని వచ్చి ఇల్లరికం ఉండమని ఆయన అడగలేదు. అతనికి ఇల్లరికమనే మాటంటే మంట, ఆ పేరు మట్టుకు తీసేస్తే, అతనికి మిగతా విషయాలన్నీ అంగీకారమే.

రవి మంచి భావనాపటిమ గలవాడు. కాలేజీలో చదువుకునే రోజుల్లో అతను నాలుగయిదు పద్యాలు రాశాడు. అందరూ మెచ్చుకున్నారు. కేవలం ఆ పద్యాలు గొప్పవని కాదు; వాటిలో అతను గొప్ప కవి కావడానికి సూచనలు కొన్ని ఉన్నాయని. భావిలో కవి కావడానికి ప్రాతిపదికగా అతను జుట్టు కత్తిరింపు మార్చుకున్నాడు. మోకాళ్లదిగే లాల్చీ, గోచీ, నేలను తుడిచేలా పంచీ, పైటలాగ అస్తమానమూ జారిపోయే ఖండువా, చేత ఒక అందమయిన పుస్తకం అన్నీ అమర్చుకున్నాడు.

బ్రహ్మానందంగారికి కుర్రవాణ్ణి చూస్తే ముచ్చట వేసింది. అతని కవిత్వం పిచ్చి అల్లుడు కావడానికి మరొక మంచి లక్షణ మనుకున్నారాయన. సామాన్యంగా చదువుకున్న యువకులు ఇది చేస్తాం, అది చేస్తాం, ఇక్కడికి పోతాం, అక్కడికి పోతాం అంటారు. కవి గనక అయితే, సామాన్యంగా పనికొచ్చే పనులేమీ చేస్తానని పట్టుబట్టడు. పుస్తకాలు కొని పారేస్తే ఏదో ఒక మూల కూర్చుని చదువుకుంటూ, రాసుకుంటూ ఉంటాడు. అంత బాధుండదు.

రవి కవి కాలేకపోవడానికి కారణం అతనికి భావనా బలం లేకపోవడం కాదు. ఆ కలలు మహస్పష్టంగా ఉంటాయి – ఉన్నంతసేపూ. అయితే, వాటిని పదాల్లో బిగించే శక్తిమట్టుకు అతనికి కనుచూపు మేరలో దోబూచులాడుతూ తప్పించుకు తిరుగుతోంది.

రవి కవి కాలేకపోయినందుకు కవితగాని, బ్రహ్మానందంగారు గాని అంతగా విచారించలేదు. కవి లక్షణాలన్నీ ఉండి, ఒక్క కవిత్వం లేకపోయినందువల్ల పెద్ద ప్రమాదమేమీ లేదు. నిజానికి ఆ కవిత్వం లేకపోతేనే కొంతనయం, కవిత్వం అంతగా మనిషిలో జీర్ణించుకుపోతే అనర్థాలొస్తాయని బ్రహ్మానందంగారి అనుమానం.

అయితే బ్రహ్మానందంగారికి – ఒక్క ఆయనకే కాదు, భార్యకీ, కవితకీ, అందరికీ – అల్లుడంటే ఒక తీరని అసంతృప్తి ఉంది. పదేళ్ళయి అత్తవారింటికి వచ్చినా, అతడు ఒక్క బిడ్డకయినా తండ్రి కాలేకపోయాడు. ఈ సంగతి రవికి బాగా తెలుసు కాని ఈ నేరారోపణ ప్రత్యక్షంగా అతని మీద ఎవరూ చెయ్యరు. అంచేత దానికి అతను సమాధానం చెప్పుకోడానికి అవకాశం రాదు. ఊహలో ఎన్నోసార్లు ఈ విషయమై అతను అందరితోనూ వాదోపవాదాలు సాగించాడు. ఒకొక్కసారి ఒకొక్క సిద్ధాంతం ప్రాతిపదిక గావించేవాడు.

అసలు పిల్లల్ని కనడం పశుప్రవృత్తి అనీ, ప్రణయానికి ప్రణయమే అంతిమ లక్ష్యంగా ఉండాలిగాని, అది పిల్లలు పుట్టడమనే లౌకిక ప్రయోజనానికి కారణభూతంగా ఉండకూడదనీ ఒక సిద్ధాంతం. రెండవ సిద్ధాంతం: అసలు లోపం తనది కాదనీ, ఉన్న లోపం ఏదో కవితలోనే ఉందనీ, ఏది ఎల్లా ఉన్నా, ఊహలో ప్రతిపక్షులమీద ఎటువంటి విజయం సాధించినా, అతని మనస్సులో ఒక మూల ఓటమి తనదని తెలుసు. అందుకే బ్రహ్మానందంగారన్నా, అత్తగారన్నా అతనికి అస్పష్టమైన వైరం. అందుకే అతని భావనా జీవితంలో వాండ్లు రాక్షసు లౌతుంటారు తరుచుగా.

అతను నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకున్న తరవాత, క్రింద నించి టిఫిన్‌కి ఆహ్వానం వచ్చేలోగా, అతను తన గదితలుపు మూసేసి ఎన్నో అవతారాలు తాల్చుతుంటాడు. ఆ ఒక గంట అతను పరిపూర్ణుడు. మరొకరి ప్రమేయం అతనికి లేదు. ఇష్టమొచ్చిన పాత్ర అతను ధరించవచ్చు. మొదట అతను గూడ కట్టుపంచె విప్పేసి అద్దంముందు నిలబడతాడు. తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ ఆనాటి అవతారాన్ని నిర్ణయించుకుంటాడు. అతను దుస్తులు వేసుకునే క్రమంలో ఆనాటి అవతారం వ్యక్తమౌతుంది. దుస్తులు మారకపోయినా, వాటిని ధరించే క్రమంలో అతని మనస్థితి నిర్ణయమౌతుంది.

వస్త్రధారణం అడుగునుంచి సవ్యంగా ప్రారంభించిననాడు అతడు రవీంద్ర కవిచంద్రుడు. మొదట న్యాయంగా తొడలాగుతో ప్రారంభించి, తల దువ్వడంతో ఆఖరవుతుంది. మరొకనాడు తల దువ్వుకోడంతో మొదలెడుతుంది. ఆనాడతను విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్ అందరూ కలిసిపోయిన ఒక మూర్తి. ఇంకోనాడు ఒక్క బనీను మాత్రం ముందు తొడుగుతాడు. పైన చెదిరిన జుట్టు, కింద వెంట్రుకలతో కూడిన కాలు అవన్నీ కులాసాతో కలిసిన అరాచకత్వానికి చిహ్నాలు. నీతి నియమాలను, ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను కుండపిడతల్లా పగలగొట్టేసి, స్వైరవిహారంచేసే ఉత్సాహవంతుడైన రౌడీ. ఆ మూర్తిలో గోపాలకృష్ణుడూ, డాన్ యు ఆన్ లాంటి పాత్రలు కలిసి ఉంటాయి.

ఆవేళ అతను ఆ పాత్రను ధరించాడు. కవిత తలుపుకొట్టి టిఫిన్ సిద్ధంగా ఉందని చెప్పింది.

"హ–హ! ఈవేళ నా మజాకా చూసుకో, డైనింగ్ టేబులంతా తారు మారయిపోతుంది. కప్పులు తినేసి కాఫీ వొదిలేస్తా. బల్లమీద కూర్చుని కుర్చీమీద టిఫిన్ పెట్టుకుంటా." లాంటి మాటలు మౌనంగా తనలో అనుకుని కవితతో "వస్తున్నా," అని మాత్రం అన్నాడు. తరువాత ఎందుకైన మంచిదని తల కొద్దిగా దువ్వుకున్నాడు.

టిఫిన్ తినవలసిన పద్ధతిగానే తిన్నాడు. మొదట ఉప్మా, తరవాత ఇడ్డెన్లూ, ఆ తరవాత కాఫీ, బాధ్యతారహితత్వం కొద్దిగానైనా సూచించడానికి టిఫిన్ తరవాత మంచినీరు మాత్రం తాగలేదు.

ఆ తరువాత దినచర్య– క్లబ్బుకిపోయి పేకాడ్డం.

పేకాటలో మట్టుకు కొంచెం లోపలి ఉత్సాహం అతనావేళ కనబరచాడు. నిర్లక్ష్యంగా ఆడ్డంవల్ల గావును, అతను నెగ్గడం ఆరంభించాడు.

మధ్యాహ్నం అయ్యేసరికి భోజనానికి వెళ్ళాలి. కాని మిగతా స్నేహితులు ఉండమని పట్టుబట్టారు. అందులో కలకత్తానుంచి ఒక్క స్నేహితుడొచ్చాడు. మళ్ళీపోతాడు. అంచేత భోజనాలు క్లబ్బులోనే చేసి, సాయంకాలందాకా పేకాడాలి. రవి సరేనన్నాడు. అంత డబ్బు నెగ్గేసి అతనింటికి పోతానంటే తక్కినవారు ఒప్పుకుంటారా?

భోజనానికి రానని ఇంటికి కబురు పంపమన్నారు మిగతా స్నేహితులు. కాని, మనసులో ఉప్పొంగుతున్న బాధ్యతా రహితత్వానికి చిహ్నంగా, రవి ఇంటికి కబురొద్దన్నాడు.

భోజనం ఒక స్నేహితుడింటివద్దనుంచి వచ్చింది. కొంచెం పాయసం పులిహోరా కూడా ఉంది. అయితే ముందు పాయసం అందరికీ కప్పుల్లో ఇచ్చారు. అది తాగితేగాని భోజనాలు లేవన్నారు. పాయసం తాగారు. రవి కూడా తాగాడు.

అన్నం తింటున్నప్పుడు రవి చెవుల్లో ఏదో చెప్పలేని హోరు ప్రారంభమయింది. క్రమంగా ఒక్కొక్క అన్నం మెతుకు తాటికాయ ప్రమాణం తాల్చింది. కూరముక్కలు బుల్లి పర్వతాల్లా ఉన్నాయి. పులిహోరలో మిరపకాయలు పక పక నవ్వాయి. "ఏడిశారు" అన్నాయి రవి వేళ్ళు. అతనికీ అన్నానికీ యుద్ధం ప్రారంభమయింది. అందులో అతనికే విజయం.

కలకత్తా నుంచి వచ్చిన మిత్రుడు "భంగు" "భంగు" అనడం అస్పష్టంగా విన్నాడు రవి. రవికి ఇదంతా కలలాగ ఉంది. అయితే మామూలుగా అతను కనే కలలాంటిది కాదు. ఆ కలలు అతని ఇష్టాన్ననుసరించి మారుతాయి. ఈ కల మాత్రం అతని అధీనంలో లేదు. అతని దర్శకత్వం లేకుండానే అది సాగిపోతోంది. అయితే అది ఆపాలన్న ఆత్రం అతనికి లేదు. అందులో కొట్టుకుపోవడం ఒక్కటే అతనికి తెలుసు.

మళ్ళీ పేకాట ఆరంభమయింది.

జీవిత మొక జూదం. అందులో నెగ్గితే ఎగిరి గంతువేసి, ఓడితే దిగులుపడేవారు తక్కువరకం మనుషులు. జూదం ఆడ్డమే ముఖ్యం; జూదమే ఒక ఆవేశం, అందులో నెగ్గినా, ఓడినా ఆనందించడమే ధీరలక్షణం. తక్కిన వాళ్ళకి జూదం ఒక దొంగ ఊబి. అంతకంతకు అందులో మునిగిపోతారు వారు. రవికి మాత్రం అదొక తామరకొలను; అందులో రవి తామరాకు మీద నీటి బిందువు.

పేకముక్కలు తామరాకుల్లాగ - అరకు చుక్కలు తామర మొగ్గల్లాగ ఉన్నాయి రవి కళ్ళకి. రూపాయిల నోట్లు దిన పత్రికల్లా ఉన్నాయి.

ఆట ముగించే సరికి రవి నూరు రూపాయలు అప్పు పడ్డాడు.

ఇంటికి తిరిగొచ్చాడు. హాలులో బ్రహ్మానందంగారు రాత్రి భోజనం ముగించి తాంబూలం సేవిస్తున్నారు.

"ఎక్కడికెళ్ళావోయి?" అన్న ఆయన గొంతు మేఘ గర్జనలాగ దశదిశలు మారు మ్రోగింది. "నా ఇష్టం; నే నెక్కడికన్నా పోతాను! నువ్వెవడవు అడగడానికి;" అని సమాధానం అతని మనసు లోపలే ప్రతిధ్వనించింది. గర్భగుడిలో చదివిన మంత్రంలాగ "క్లబ్బు" అన్న అస్పష్టమైన మాటొకటే బ్రహ్మానందంగారికి వినపడ్డది.

అతనుండేది అసలు ఇల్లు కాదు; ఆ ఇంటి వెనక తోటలో ఉన్న రెండు గదుల మేడ. దొడ్డి గుమ్మాని కెదురుగా తులసికోట వింధ్యపర్వతంలాగ అడ్డుతగిలింది. అయితే అగస్త్య మహర్షిలాగ దాన్ని అతిక్రమించి తన గమ్యస్థానం చేరుకున్నాడు.

అతను మేడమెట్లు యెక్కుతుంటే గడియారం తొమ్మిది కొడుతోంది - అతని రాకను గురించి హెచ్చరించే విజయదుందుభిలాగ. మేడమీద ఆ వేళగాని వేళ - హిందీ మాష్టరు కవితకు పాఠం చెపుతున్నాడు. వారి సంభాషణలో ఏదో సందర్భం వచ్చింది గాబోలు - అతను నవ్వుతున్నాడు.

రవికా నవ్వు కలలో రాక్షసుని వికటహాసంలాగా మోగింది. "మంచినీళ్ళు" అని అనవసరంగా గొంతు పెద్దది చేసి అన్నాడు రవి. కవిత కొంచెం దూరంగా కూర్చున్న పనివాడితో, "అయ్యగారికి మంచినీళ్ళు తేరా," అంది. "ఆ" అన్నాడు తనకు తెలియకుండానే రవి. తన గదిలోనికి వెళ్ళిపోయాడు. కవితకు అతని ధోరణి కొంత వింతగా కనిపించిందేమో, అతన్ని అనుసరించి గదిలోకి వెళ్ళింది.

ఆ తరువాత జరిగిన విషయాలు రవికంత స్పష్టంగా గుర్తులేవు. ఆమె లోపలికి రాగానే తలుపును కాలితో తన్ని మూశాడు. ఆమెను అమాంతంగా కలలో లాగ రెండు చేతుల్లోనూ ఎత్తుకున్నాడు. కవిత కంగారు పడింది గాని గట్టిగా మాట్లాడితే అవతల హిందీ మాష్టరుకి వినపడుతుందని 'ఏమిటండిదీ మతి పోయిందా.' అని మెల్లగా అంది. ఆ తరువాత పందిరి మంచంవేపు తన చేతిలో ఆ బరువెత్తుకుని పడినట్టు రవికి గుర్తు. అతడు తన లక్ష్యాన్ని సాధించాడో లేదో అతనికి స్పష్టంగా జ్ఞాపకం లేదు.

మూసిన తలుపు కొద్దిగా తెరుచుకుంది. ఆ చీలికలోంచి అస్పష్టంగా కనిపించిన దృశ్యం చూసి హిందీ మాష్టరు రెండు గుటకలు వేశాడు. మంచి నీళ్ళు తెచ్చిన పనివాడిని చేత్తో సంజ్ఞచేసి ఆపాడు. ఆ మంచినీళ్లు తనే తాగేశాడు. పనివాడిని చెయ్యి పట్టుకుని తనతో కూడా మేడమెట్లు దింపేశాడు.

ఆ తరవాత కొద్దిరోజులకు కవితకు నెల తప్పిందన్న వార్త విని బ్రహ్మానందంగారు, ఆయన భార్య ఎంతో సంతోషించారు. అల్లుడిమీద వాళ్ళకు గౌరవం అమితంగా పెరిగింది.

- అసలు తేది తెలియదు?

**("నవకథావళి" సంకలనం - వివిధ రచయితలు - ప్రచురణ: గుండిమోదాస్, ఏలూరు)**